క్లుప్తంగా

నిర్మాణ రంగంలో ఉద్యోగ అవకాశాలు

నంద్యాల(న్యూటౌన్): ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ యువతకు నిర్మాణ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు నంద్యాల జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కువైట్‌లో సిరామిక్ ఫ్లోరింగ్, పెయింటింగ్, ఎలక్ట్రికల్, సీలింగ్ వర్క్ తదితర పనికి ఐటీఐ, డిప్లొమో కలిగి ఉండి 25 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న పురుష అభ్యర్థులు అర్హులన్నారు. నెలకు రూ.56వేల నుంచి రూ.70వేల వరకు జీతం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు పూర్తి వివరాలను ఈనెల 12లోగా తమకు సమర్పించాలన్నారు. మరింత సమాచారం కోసం సెల్: 99888 53335 నంబరును సంప్రదించాలన్నారు.

10న మెగా పేరెంట్స్‌మీట్


అధికారులతో చర్చిస్తున్న ఎంఈఓ

దొర్నిపాడు: ఈనెల 10న అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్స్‌మీట్ నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ మనోహర్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీ శివప్రసాద్, తహసీల్దార్ సుభద్ర, క్లస్టర్ హెచ్ఎం చెన్నకేశ్వరిలతో ఆయన చర్చించారు. ఒక షెడ్యూల్ ప్రకారం పేరెంట్స్‌మీటింగ్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 రామచంద్రయ్య పాల్గొన్నారు.

నంద్యాల మెడికల్ కాలేజీ డాక్టర్‌కు గోల్డ్ మెడల్


గోల్డ్ మెడల్ అందుకున్న డాక్టర్‌ను అభినందిస్తున్న దృశ్యం

గోస్పాడు: నంద్యాల మెడికల్ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ సుజాత గోల్డ్ మెడల్ అందుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ సోమవారం కళాశాలలో ఆమెను సన్మానించి మాట్లాడారు. ఈనెల 4, 5, 6 తేదీలలో 22వ ఆర్ఎస్ఏ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో చాప్టర్స్ అనాటమీ విభాగంలో హార్ట్ ఎటాక్ పై కాన్ఫరెన్స్ నిర్వహించారు. డాక్టర్ సుజాత మంగళగిరిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని ఉత్తమ పోస్టల్ ప్రజెంటేషన్ చేశారని ప్రిన్సిపాల్ తెలిపారు. దీంతో ఆమెకు గోల్డ్ మెడల్ వచ్చిందన్నారు. కార్యక్రమంలో అనాటమీ హెచ్ఓడీ డాక్టర్ జయమ్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ కళావతి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శోభా యాత్ర


పట్టణంలో సాయిబాబా చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని నాగుల కుంట రోడ్‌లో వెలసిన శ్రీ షిర్డీ సాయిబాబా దేవస్థానంలో గురుపౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం శోభా యాత్రను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ట్రాక్టర్‌పై బాబా చిత్రపటాన్ని అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. నాగుల కుంట రోడ్డు, కల్పనా సెంటర్, ఆర్టీసీ బస్టాండ్, మెయిన్ బజార్, సంజీవ్ నగర్, శ్రీనివాస్ నగర్ మీదుగా ఈ యాత్ర సాగింది. షిర్డీ సాయిబాబా సేవా సమితి సభ్యులు కందుకూరి శ్రీరామమూర్తి, సుబ్బరామయ్య, కల్లూరి రామలింగారెడ్డి మాట్లాడుతూ ఈనెల 10వ తేదీన గురు పౌర్ణమి పురస్కరించుకొని బాబాను ఉదయాన్నే కాగడ హారతి, విష్ణు సహస్రనామాలు, అభిషేకాలు, సంధ్యా హారతి, పల్లకీ సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు

ఉయ్యాలవాడ : ప్రజా వినతులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సువర్ణాదేవి, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కర వేదిక నిర్వహించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భూ సంబంధ సమస్యలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జనన, మరణ సర్టిఫికెట్లు కోసం పలువురు వినతిపత్రాలను సమర్పించారు. కార్యక్రమంలో పీఆర్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈలు వెంకటయ్య, ఫణీత్‌క్రిష్ణ, వెలుగు ఏపీఎం దాసు, పశు వైద్యాధికారి రఘు బాలపుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బాబు మోసాలను ఎండగడదాం



నియోజకవర్గ స్థాయి సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి

- ఓట్ల కోసం ఎన్నికల ముందు అడ్డగోలు హామీలు
- అధికారంలోకి వచ్చాక ప్రజలకు వెన్నుపోటు
- బాబు దగాను ఇంటింటికి వెళ్లి వివరిద్దాం
- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు జిల్లా అధ్యక్షుడు కాటసాని పిలుపు
- ఆళ్లగడ్డలో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ సన్నాహక సభ విజయవంతం

ఆళ్లగడ్డ: ఇంటింటికి వెళ్లి చంద్రబాబు మోసాలను ఎండగడదామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. అధికారమే పరమావధిగా దారిన కనిపించిన వారందరితో చేతులు కలిపి నాడు అడ్డగోలు హామీలు ఇచ్చారన్నారు. నమ్మి ప్రజలు ఓటేశాక వాటి ఊసే ఎత్తడం లేదని ధ్వజమెత్తారు. సోమవారం ఆళ్లగడ్డలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ సన్నాహక కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో రీకాలింగ్ చంద్రబాబుస్ మేనిఫెస్టోపై క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. పార్టీ నంద్యాల పార్లమెంట్ పరిశీలకురాలు, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి హాజరైన ఈ కార్యక్రమంలో కాటసాని మాట్లాడుతూ చంద్రబాబు ప్రజలను ఏవిధంగా మోసం చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ఈ ఏడాదిలో ప్రజలు ఎంత నష్టపోయారు తదితర వివరాలను సవివరంగా తెలియ జేసేందుకే రీకాలింగ్ చంద్రబాబుస్ మేనిఫెస్టో కార్యక్రమం చేపట్టామన్నారు. 2024 ఎన్నికల ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని శ్రీలంక చేస్తున్నారని దుష్ప్రచారం చేశారన్నారు. టీడీపీ మేనిఫెస్టోలో మాత్రం జగన్ ఇచ్చిన సంక్షేమ పథకాలను ఏపీ రద్దు చేయము.. అంతకు మించి సంక్షేమ పథకాలు అందజేస్తామని నమ్మించారన్నారు. ఏడాది గడిచినా అతీగతీ లేదన్నారు. 'వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో 3 లక్షల కోట్లు అప్పు చేసి సంక్షేమ పథకాలు అందజేస్తే ఏడాది బాబు పాలనలో రూ 1.75 లక్షల కోట్లు అప్పు చేశారన్నారు. ఈ మొత్తం ఎవరికి పంచిపెట్టారో లెక్క చెప్పాలన్నారు. దీనిపై ఇళ్ల వద్దకు టీడీపీ నాయకులు వచ్చినప్పుడు నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పింఛన్ పథకాన్ని గొప్పగా చెప్పుకుంటున్న టీడీపీ నేతలు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన వాటి కంటే ఒక్క కొత్త పింఛన్ అయినా మంజూరు చేశారా అని ప్రశ్నించారు. ఏడాది పాలనలో కనీసం అర్హులైన ఒక్క టీడీపీ కార్యకర్తకైనా పింఛన్ ఇచ్చారేమో చెప్పాలన్నారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు కార్యక్రమం చేపట్టాక కూటమి సర్కారు దిగివచ్చి అరకొరగా తల్లికి వందనం పథకాన్ని అమలు చేసిందన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 87 లక్షల మంది విద్యార్థులకు రూ. 13,500 కోట్లు అవసరముంటే రూ. 8 వేల కోట్లు మాత్రమే విడుదల చేసి అందరికీ ఇచ్చామని చంకలు కొట్టుకుంటున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు తన మాయమాటలతో ప్రజలను మోసం చేయడం కొత్తేమి కాదని 1999 నుంచి ఆయన ఇదే పద్ధతి అవలంబిస్తున్నారని విమర్శించారు.

పబ్లిసిటీ పీక్.. ఫర్ఫార్మెన్స్ వీక్

ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పబ్లిసిటీ పీక్ గా ఉంటుంది కానీ ఫర్ఫార్మెన్స్ మాత్రం వీక్ అని అన్నారు. సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయకపోగా ప్రజలకు ఇచ్చిన హామీలను సైతం విస్మరించారని ఆరోపించారు. ఎన్నికల ముందు సంతకాలు చేసి బాండు ఇచ్చారంటే మనకు అప్పు ఉన్నట్లే. అప్పు వసూలు చేసే దాక కూటమి నేతలను వదలకూడదన్నారు. బాబు మోసాలను ఇంటింటికి వెళ్లి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.


బాబు వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం

వైఎస్సార్‌సీపీ నాయకుడు భూమా కిషోర్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ప్రజా వ్యతిరేక విధానాలను, వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్దామని చెప్పారు. ఇందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు. గత ఎన్నికల్లో కూటమి నేతలు ఇచ్చిన బాండ్లతో పాటు చంద్రబాబు మోసాలను ఎండగట్టాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గంగుల విజయసింహారెడ్డి, గంధం రాఘవరెడ్డి, డాక్టర్ శీలం సురేంద్ర, కేకే రెడ్డి, ఆరు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు

పోరాటాలు మనకు కొత్తకాదు

ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి మాట్లాడుతూ 'పోరాటాలు మనకు కొత్తకాదు. జగనన్న పార్టీ పెట్టినప్పటి నుంచి ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నాం. ఇప్పుడు చూస్తుండగానే ఏడాది గడిచిపోయింది. అరాచకాలను తిప్పి కొట్టేందుకు సంసిద్ధమవుదాం. చంద్రబాబు జీవితకాలమంతా మోసమే. అవసాన దశలో ఉన్నాడు కదా ఈ సమయంలో మోసం చేయరులే అని భావించి ప్రజలు ఓట్లు వేశారు. అయితే, ఏడాదిలోనే ఆయన నైజాన్ని మరోసారి బయటపెట్టుకున్నాడు. నియోజకవర్గంలో టీడీపీ నేతల అరాచకాలు పెరిగిపోయాయి. వీటిని ప్రజలు గమనిస్తున్నారు. సందర్భం వచ్చినప్పుడు వారే బుద్ధి చెబుతారు. అధికారపార్టీ నాయకులు తాటాకు చప్పుళ్లు చేస్తున్నారని వాటికి సామన్య ఓటరు కూడా బయపడరనే విషయం గుర్తించుకోవా'లని చెప్పారు. బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా బాబు హామీలను గుర్తు చేయాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

రాజన్నకు 'చిత్రాంజలి'


కోటేష్ గీచిన వైఎస్సార్ చిత్రం

నంద్యాల(అర్బన్):పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ వైఎస్సార్ చిత్రాన్ని మహారాజు గెటప్‌లో వేసి నివాళులర్పించారు. చిత్రంలో రాజన్న రాజసం, ఆకట్టుకునే ఠీవి, చిరు మందహాసం చూపించారు. నేడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని ఈ చిత్రం వేసినట్లు తెలిపారు. అయితే, ఏటా ఇలా వైఎస్సార్ చిత్రాలను వినూత్న రీతిలో చిత్రిస్తూ నివాళులర్పిస్తున్న కోటేష్‌ను పలువురు ప్రశంసిస్తున్నారు.

ముచ్చుమర్రి వాసంతికి కొవ్వొత్తులతో నివాళి


కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామానికి చెందిన బాలిక వాసంతి హత్యకు గురై ఏడాది పూర్తయింది. ఇంతవరకు ఆమె మృతదేహం లభించలేదు. నిందితుల అరెస్టు జరగలేదు. ఈ విషయాల్లో సర్కారు తీరును నిరసిస్తూ ఎంవీఆర్‌పీఎస్ నాయకులు సోమవారం వసంతి చిత్రపటం ముందు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బోయ పులికొండన్న మాట్లాడుతూ హత్య చేసిన వారు అదే గ్రామాల్లో ధైర్యంగా తిరుగుతుండటం దారుణమన్నారు. ప్రభుత్వం బాధిత కుటుంబానికి డబ్బులు ఇచ్చి చేతులు దులుపుకుంది తప్ప న్యాయం చేయలేదన్నారు. ఏ ఆడపిల్లకు ఇలాంటి దుస్థితి రాకూడదన్నారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు పెద్దక్క, గౌరి, రాణి, నాయకులు కుమార్, గిరి, రమణ, రాంపుల్లయ్య, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ తల్లికి వందనం,అన్నదాత సుఖీభవ

- అధికారులతో జిల్లా కలెక్టర్ రాజకుమారి


మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, డెంగీ, పీ4 మార్గదర్శి–బంగారు కుటుంబాలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తల్లికి వందనం రెండో విడత జాబితాను ఈ నెల 10వ తేదిలోపు సిద్ధం చేయాలన్నారు. అంగన్‌వాడీ నుంచి ఒకటో తరగతి, ఐదవ తరగతి నుంచి ఆరవ తరగతిలో చేరిన విద్యార్థులను జాబితాలో చేర్చి తల్లికి వందనం అందేలా చూడాలన్నారు. అందుకు తల్లి బ్యాంకు ఖాతా, ఆధార్‌కు అనుసంధానం అయ్యిందో లేదో తనిఖీ చేసుకోవాలన్నారు. అదే విధంగా మండల పరిధిలో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు ఎటువంటి సాంకేతిక సమస్యలు ఉనా గ్రామ సచివాలయ కోఆర్డినేటర్ దృష్టికి తేవాలన్నారు. అన్నదాతకు సంబంధించి పెండింగ్ ఈనామ్ భూముల వివరాలను తహసీల్దార్, ఆర్డీఓలు సంబంధిత సైట్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గ్రామాల్లో విష జ్వరాల ప్రబలకుండా చూడాలన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం లోపించకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. పీ4 (పబ్లిక్–ప్రైవేటు–పీపుల్స్–పార్టనర్ షిప్)కు సంబంధించి ఆగస్టు 15వ తేది నాటికి జిల్లాలో నమోదైన బంగారు కుటుంబాలకు చేయూత ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్ఓ రాము నాయక్, డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా వివేకానందరెడ్డి



రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న వివేకానంద రెడ్డి

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది ముక్కామళ్ల వివేకానంద రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం రోటరీ భవనంలో ఎలెక్ట్ గవర్నర్ కేశవ రెడ్డి, పీడీజీలు శ్రీరాం మూర్తి చిన్నపురెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఇందులో ఉపాధ్యక్షుడిగా ప్రసాదరెడ్డి, సెక్రటరీగా కామిని బాలకృష్ణ, జాయింట్ సెక్రటరీగా లక్కభూషణం కోశాధికారిగా లక్ష్మీకాంతరెడ్డి ఎన్నికయ్యారు. అదే విధంగా ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షుడిగా ఎంఎస్ మల్లేశ్వరి, కార్యదర్శిగా రేణుక, పద్మ, కోశాధికారిగా సుధా కుమారి ఎడిటర్‌గా జయమ్మ నియమితులయ్యారు. రోటరీ క్లబ్ ఆఫ్ నవనంది కొత్త ప్రెసిడెంట్‌గా బాల కృష్ణ, కార్యదర్శిగా నవీన్ కోశాధికారిగా మధు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో శ్వేతా రెడ్డి, సుధాకర్ రెడ్డి, డీవీ రత్నమ్మ, సుబ్బరామయ్య, జయకృష్ణ, విజయ శేఖర్ రెడ్డి, శశిదర్,రామశేషులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం

నంద్యాల: మండలంలోని అయ్యలూరు మెట్ట వద్ద సోమవారం రాత్రి మోటార్‌సైకిల్, లారీ ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్తా తెలిపిన వివరాల మేరకు.. రుద్రవరం మండల ఎల్లవత్తుల గ్రామం ఆర్ఎంపీ రమేష్, మరో వ్యక్తి కలిసి మోటార్‌సైకిల్‌పై నంద్యాల వైపు వెళ్తున్నారు. అయ్యలూరు మెట్ట వద్దకు చేరుకోగానే గిద్దలూరు వైపు వెళ్తున్న లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. రాత్రి 11 గంటల సమయంలో జరిగిన ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డీఈఓకు వినతి


డీఈఓకు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): కీర్తన ప్రైవేటు స్కూల్ గుర్తింపును తక్షణమే రద్దు చేయాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డీఈఓ జనార్దన్‌రెడ్డిని కలిసి రాయలసీమ విద్యార్థిఫెడరేషన్ నాయకులు రామచంద్రుడు, వేణు మాధవరెడ్డి, రాజునాయుడు వినతిపత్రం అందజేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నర్సరీ చదువుతున్న హరిప్రియ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో బస్సు చక్రాల కింద పడి మరణించిందన్నా రు.చిన్నారి కుటుంబానికి రూ.25లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఆళ్లగడ్డలోని కీర్తన ప్రైవేటు స్కూల్ ఉర్తింపును రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ, ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుల ఆందోళన


మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

నంద్యాల(న్యూటౌన్): మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నంద్యాల మున్సిపల్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ఓబులేసు మాట్లాడుతూ మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. రిటైర్డు, మరణించిన వారి స్థానంలో వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. కార్మికులకు పని ముట్లు ఇవ్వడంతో పాటు పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ న్యాయమైన మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసాకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రంజీత్, కార్యదర్శి ప్రతాప్, సహాయ కార్యదర్శి శివరాం, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు స్థలంపై కన్ను

- బరితెగించిన అధికారపార్టీ నాయకులు
- విలువైన 1.74 ఎకరాల స్థలం కాజేసేందుకు యత్నం


అధికార పార్టీ నాయకులు కాజేసేందుకు చూస్తున్న బాలాజీ కాంప్లెక్స్‌లోని 1.74 ఎకరాల స్థలం ఇదే

నంద్యాల(అర్బన్): అధికారపార్టీ నాయకులు బరితెగించారు. పట్టణ నడిబొడ్డులో కోట్ల రూపాయల విలువైన వక్ఫ్ బోర్డు స్థలాన్ని కాజేసేందుకు యత్నిస్తున్నారు. బాలాజీ కాంప్లెక్స్‌లోని లతీషియా మసీదు పరిధిలో సుమారు 1.74 ఎకరాల స్థలం ఉంది. పట్టణంలో అధికారపార్టీకి చెందిన రెండు వర్గాలు ఈ స్థలంపై కన్నేయడంతో వక్ఫ్‌బోర్డు అధికారులు ఏం చేయలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

కమర్షియల్ ఏరియాలో..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చౌకు మసీదు, లతీషియా మసీదులకు వక్ఫ్‌బోర్డు అధికారులు నూతన కమిటీలను ఏర్పాటు చేశారు. చౌక్ మసీదుకు అనుసంధానంగా ఉన్న లతీషియా మసీదు ప్రాంగణంలోని బాలాజీ కాంప్లెక్స్ ఏరియాలో 1.74 ఎకరాల వక్ఫ్‌బోర్డు స్థలం ఉంది. చౌక్ మసీదు ముతావల్లి రజాక్‌మియాతో ఉన్న పరిచయంతో ప్రస్తుత రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహమ్మద్ 2006లో 11 నెలలకు సంబంధించి వక్ఫ్ బోర్డు స్థలాన్ని లీజ్‌కు తీసుకున్నారు. అనంతరం ఇక్రా స్కూల్ ఏర్పాటు చేసి పాఠశాల, మదరసాలను నడిపాడు. 2017లో టీడీపీ హయాంలో ఏకంగా 30 ఏళ్ల వరకు వక్ఫ్ బోర్డు స్థలాన్ని లీజు మంజూరు చేయించుకున్నారు. అయితే, లీజు డబ్బులు చెల్లించకపోవడంతో ఇటీవల వక్ఫ్‌బోర్డు అధికారులు పోలీసులు, రెవెన్యూ అధికారుల సాయంతో పాఠశాల గదులను సీజ్ చేశారు. 2021లో ముతవల్లి రజాక్ మియ్య కొడుకు మదరసాను మేమే కొనసాగిస్తామంటూ ముందుకు వచ్చారు. ఏడాది క్రితం గి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో మౌలానా ముస్తాక్ అహమ్మద్ రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ పదవిని అడ్డుపెట్టుకొని ఆయన ఇటీవల వక్ఫ్‌బోర్డు అధికారులు సీజ్ చేసిన రూముల తాళాలు తెరిచి కార్యాలయంగా మార్చుకున్నారు. సీజ్ చేసిన రూములను ఎలా తెరుస్తారంటూ పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఓ మసీదులో జరిగిన సంఘటనలో చౌక్ మసీదు, లతీషియా మసీదుల కమిటీల ఏర్పాటుపై రగడ చోటు చేసుకోవడం, రెండు టీడీపీ వర్గాలు ఆదిపత్య పోరుకు సిద్ధమయ్యాయి. వక్ఫ్‌భూమి నియంత్రణ తమదంటే.. తమదని మౌలానా ముస్తాక్ అహమ్మద్, అధికార పార్టీ నాయకులు వాదులాటకు దిగడంతో వక్ఫ్‌బోర్డు అధికారులు తలలు పట్టుకోవాల్సి వస్తోంది. మొత్తం మీద వక్ఫ్ స్థలానికి లీజు డబ్బులు చెల్లించకుండానే రూముల తాళాలు తెరిచి కార్యాలయంగా మార్చుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ముగిసిన మొహర్రం వేడుకలు


రుద్రవరంలో ఊరేగుతున్న పీర్లు

ఉయ్యాలవాడ : కులమతాలకతీతంగా జరుపుకునే మొహరం పండుగ వేడుకలు మండలంలో సోమవారం ముగిశాయి. ఈ నెల 2వ తేదీన మండల కేంద్రం ఉయ్యాలవాడతో పాటు అల్లూరు, హరివరం, పడిగెపాడు, రూపనగుడి, ఆర్.పాంపల్లె, మాయలూరు, బోడెమ్మనూరు, తదితర గ్రామాల్లో కొలువుదీరిన పీర్లను ప్రత్యేక అలంకరణ గావించారు. ప్రత్యేక ఫాతేహాలు సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. చివరి రోజు సోమవారం సాయంత్రం పీర్లను ప్రత్యేక గుమటాలలో అమర్చి గ్రామోత్సవం చేపట్టారు. తర్వాత కుందూనదిలో నిమజ్జనం చేశారు.

రుద్రవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం మొహర్రం వేడుకలను భక్తిశ్రద్ధలతో ముగించారు. ఆయా గ్రామాల్లో చావిళ్లలో కొలువుదీరిన పీర్లకు ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. అనంతరం చావిళ్ల నిర్వాహకులు పీర్లకు గ్రామోత్సవం నిర్వహించారు.

దొర్నిపాడు: మండలంలో మొహర్రం వేడుకలు సోమవారం ముగిశాయి. కులమతాలకు అతీతంగా భక్తులు భక్తిశ్రద్ధలతో పీర్లకు ఫాతెహాలు సమర్పించారు. అనంతరం పీర్లను ఊగేగించగా స్థానికులంతా పెద్దసంఖ్యలో హాజరై పీర్లను దర్శించుకున్నారు.


ఉయ్యాలవాడలో పీర్ల ఊరేగింపు దృశ్యం


ఊరేగింపులో సాంస్కృతిక కార్యక్రమాలు

చిలుకల కుటుంబానికి అండగా ఉంటాం


వెంకటసుబ్బయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

నంద్యాల: మాజీ కౌన్సిలర్ చిలుకల వెంకటసుబ్బయ్యగౌడ్ కుటుంబం ఎన్నో ఏళ్లుగా తమ వెంట నడిచిందని, ఆ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్ రెడ్డి అన్నారు. వెంకటసుబ్బయ్య గౌడ్ తల్లి మాజీ కౌన్సిలర్ చిలుకల లక్ష్మీదేవమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా సోమవారం వెంకటసుబ్బయ్య గౌడ్ కుటుంబాన్ని పరామర్శించి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దాల్‌మిల్ అమీర్, మాజీ కౌన్సిలర్ పుల్లమ్మ, న్యాయవాది రామసుబ్బయ్య, మాధవరెడ్డి, మాధవస్వామి, యూనిస్, బషీర్, అహమ్మద్, రామచంద్రుడు, ఎద్దురవి, మేస ప్రసాద్, కారు రవికుమార్, హుసేన్‌రెడ్డి, షేక్షా, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన కారు రవి..

మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డిని సోమవారం వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కారురవికుమార్ కలిశారు. శిల్పారవి నివాసంలో కలిసిన ఆయన శాలువాతో సత్కరించారు.

పనిచేయని వీసీ సెట్


తన మొబైల్ ఫోన్ ద్వారా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న తహసీల్దార్ విజయ్ కుమార్

చాగలమర్రి: కూటమి ప్రభుత్వం ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తుంది. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన తర్వాత తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ వీసీ సెట్ నిర్వహిస్తున్నారు. అయితే గత రెండు నెలలుగా వీసీ సెట్ పనిచేయక నిరుపయోగంగా ఉంది. దీనిని ఎవ్వరు పట్టించుకోవడం లేదు. తప్పని పరిస్థితిలో సోమవారం వీడియో కాన్ఫరెన్స్‌ను తహసీల్దార్ తన మొబైల్ ఫోన్‌లో చేపట్టారు. ఉన్నతాధికారులు స్పందించి వీసీ సెట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

భక్త జనం మధ్య లాల్‌స్వామి ఊరేగింపు


ముత్యాలపాడు గ్రామంలో భక్తజనం మధ్య శ్రీలాల్‌స్వామి ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో మొహర్రం పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని పీర్ల చావిడిలో కొలువు దీరిన శ్రీలాల్‌స్వామి చిన్న సరిగెత్తు ఆదివారం అర్ధరాత్రి , సోమవారం మధ్యాహ్నం పెద్ద సరిగెత్తు నిర్వహించారు. వందలాదిగా తరలివచ్చిన భక్త జనం మధ్య ఈ కార్యక్రమం సాగింది. దాబుగాళ్ల మాబుసాహెబ్, పెద్ద మాబుసాహెబ్, ఇమాంసా, అబ్దుల్ రసూల్, చాంద్‌బాషా ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన పీర్ల చావిడి నుంచి ఊరేగింపు మొదలైంది. స్వామికి దారిపొడవునా భక్తులు దర్శించుకొని, ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చాగలమర్రి ఎస్ఐ సురేష్ ప్రత్యేక పోలీసు బందోబస్తు నిర్వహించారు